ప్రజాశక్తి

గురువారం 5 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

హోర్డింగ్‌లలో గోల్‌మాల్

బకాయిలు చెల్లించకుండానే లీజు మార్పిడి - గుంటూరు కార్పొరేషన్ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు నగరపాలక సంస్థ (కార్పొరేషన్)కు రావాల్సిన ఆదాయానికి మరోసారి గండిపడింది. హోర్డింగ్‌ల నిర్వహణల ద్వారా రావాల్సిన ఆదాయం కార్పొరేషన్‌కు రాకుండా రాజకీయ నేతలకు, ఏజెన్సీల నిర్వాహకుల జేబుల్లోకి వెళ్తోంది. నగరంలో మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జెంబో హోర్డింగ్స్ ద్వారా ప్రజల నుంచి పెద్ద ఎత్తున సొమ్ములు వసూలు చేస్తున్న ఏజెన్సీ లీజు దారులు కార్పొరేషన్‌కు మాత్రం చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించడం లేదు. రాజకీయ అండదండలతో లీజులను కైవసం చేసుకున్న ఒక ఏజెన్సీ కార్పొరేషన్‌కు గత రెండేళ్లలో దాదాపు రూ.మూడున్నర కోట్ల వరకు బకాయిలు పడింది. వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే బంధువు అయిన ఈ ఏజెన్సీ నిర్వహకుడు నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి యాడ్స్, ప్రచార పోస్టర్ల రూపంలో భారీగా వసూలు చేసుకున్నారు. కానీ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన సొమ్ము మాత్రం సకాలంలో చెల్లించడం లేదు.

రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోవడంతో టిడిపి వారు ఈ హోర్డింగ్‌ల నిర్వహణపై కన్నేశారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండానే లీజు ఒప్పందాలను మార్చుకున్నారు. టిడిపి నాయకులకు చెందిన ఒక సంస్థకు లీజు మార్పిడి ఒప్పందాలు జరిగాయి. కానీ ఇప్పటి వరకు హోర్డింగ్‌లు నిర్వహించిన సంస్థ చెలించాల్సిన బకాయిలు మాత్రం చెల్లించకుండానే లీజు ఒప్పందాల మార్పిడికి అధికారులు అంగీకరించారు. ఈ సందర్భంగా అధికారులకు కూడా కొంత వాటా ముప్పచెప్పినట్టు ప్రచారమవుతోంది. కూడలి ప్రదేశాలో జనసమ్మర్ధం కలిగిన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధమని తెలిసినా వైసిపి హయాంలో కార్పొరేషన్ అధికారులు, అప్పటి కౌన్సిల్ వీటి ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా వీటిని కొనసాగిస్తోంది. కార్పొరేషన్ విద్యుత్ వినియోగించుకుంటూ హోర్డింగ్‌లకు మాత్రం ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారు. ఏటా రూ.కోట్లల్లో ఆదాయం వస్తున్నా కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన బకాయిలు మాత్రం చెల్లించడం లేదు.

నగరంలో దాదాపు 30 కూడలి ప్రదేశాల్లో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తామని జెండో హోర్డింగ్స్ ఏర్పాటు చేసి రూ.కోట్లతో ఆదాయం పొందుతున్నా నిబంధనల ప్రకారం సిగ్నల్ లైట్లు నిర్వహణ చేయడం లేదు. కార్పొరేషన్ విద్యుత్‌తోనే హోర్డింగ్‌లకు భారీగా విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారని వైసిపి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. లీజు తీసుకుని సొమ్ములు దండుకున్న ఏజెన్సీ దాదాపు మూడున్నర కోట్ల వరకు బకాయి ఉండగా రూ.50 లక్షలకు చెక్కు ఇచ్చి తరువాత తనకు నష్టాలు వచ్చాయంటూ హైకోర్టులో స్టే కోసం వెళ్లారు. హైకోర్టు స్టే ఇవ్వకపోవడంతో వాయిదాల పద్ధతిలో బకాయిలు చెల్లిస్తానంటూ కార్పొరేషన్ అధికారులను మ్యానేజ్ చేసుకున్నారు.

▶ 2లో

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధి సిపిఎం లక్ష్యం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం
- జిల్లా మహాసభ సందర్భంగా పట్టణంలో రేపు భారీ ర్యాలీ
- పల్నాడు బస్టాండ్‌లో బహిరంగ సభ, ప్రకాష్‌నగర్ షాదీఖానాలో ప్రతినిధుల సభ : జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధి సిపిఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరగనున్న సిపిఎం పల్నాడు జిల్లా 25వ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లా మహాసభ సందర్భంగా శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని కోట సెంటర్ నుండి పల్నాడు బస్టాండ్ వరకు భారీ ర్యాలీ, పల్నాడు బస్టాండ్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. 7, 8 తేదీల్లో ప్రకాష్ నగర్ షాదీఖానాలో జిల్లా మహాసభ ఉంటుందని చెప్పారు. వక్తలుగా రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటి సభ్యులు వి.కృష్ణయ్య, కె.హరికిషోర్ హాజరవుతారని చెప్పారు.



పింఛన్ల పెంపు మినహా అన్నీ మోసమే

గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిన సందర్భంలో బాదుడే బాదుడు అంటూ విమర్శించిన చంద్రబాబు ప్రస్తుతం విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని విజయ్‌కుమార్ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ.17 వేల కోట్ల విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని, ఇది ప్రజలను నమ్మించి మోసం చేయడమేనని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపుపై సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా

▶ 2లో

188 మంది కార్యదర్శులకు షోకాజులు

ప్రజాశక్తి-గుంటూరు

వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు స్పష్టం చేశారు. వరుసగా 13 రోజులు బయోమెట్రిక్ నమోదు చేయని 188 మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు షోకాజు నోటిసులు జారీ చేశామని కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శులు విధిగా సమయ పాలన పాటిస్తూ తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. షోకాజు నోటీసులు అందుకున్న వారిలో ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు 13, వెల్ఫేర్ సెక్రెటరీలు 8, ఎడ్యుకేషన్ సెక్రెటరీలు 35 మంది, అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీలు 26, ఏమినిటిస్ సెక్రెటరీలు 46, శానిటేషన్ సెక్రెటరీలు 17, రెవెన్యూ సెక్రెటరీలు 32, హెల్త్ సెక్రెటరీలు 11 మంది ఉన్నారు.

పుష్ప తరహాలో స్మగ్లింగ్

- పేపర్ బండిల్స్ మధ్య ఉంచి ఎర్రచందనం రవాణా
- రూ.3.24 కోట్ల విలువ చేసే 49 దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



భారీ హిట్ చిత్రమైన పుష్ప సినిమాలో... పాల వ్యానులు, పెళ్లి వాహనాల్లో ఎర్ర చందనం దుంగలను తలించిన తరహాలో పేపర్ బండిల్స్ మధ్య ఎర్ర చందనాన్ని తరలిస్తుండగా పోలీసులు సినీఫక్కీలో పట్టుకున్నారు. వీటిని చెన్నయ్ నుండి అస్సాంకు తరలిస్తున్నట్లు తెలిసింది. దీనిపై మంగళగిరి రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రచందనంను తరలిస్తున్నారనే సమాచారంతో మంగళగిరి రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ సిహెచ్ వెంకట్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక నిఘా విభాగం సిబ్బంది కాజ టోల్‌గేట్ వద్ద బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పెద్ద లారీలో ఎ4 పేపర్ బండిల్స్ లోడు లారీ వచ్చింది. అనుమానం వచ్చిన పోలీసులు పరిశీలనకు పూనుకోగా లారీ డ్రైవర్ పరారయ్యాడు. అనంతరం పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా వారికి పుష్ప సినిమా కనిపించినట్లయింది. పేపర్ బండిల్‌స మధ్యలో భారీ ఎర్రచందనం దుంగలను చూసి అవాక్కయ్యారు. వాహనాన్ని మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారుల సమక్షంలో లెక్కించారు. మొత్తం 49 దుంగలు ఉండగా వీటి బరువు మొత్తం 1200 కిలోలుగా నిర్ధారించారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.3.24 కోట్ల వరకూ ఉంటుందని సమాచారం. ఇవి చెన్నయ్ నుండి అస్సాంకు తరలుతున్నట్లు గుర్తించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అక్రమ రవాణా వెనక ఎవరి పాత్ర ఉందనేదానిపై విచారణ చేస్తున్నారు.



లంక గ్రామాల్లో షెల్టర్లు ఏర్పాటు చేయాలి

హోం మంత్రికి వివరించిన గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి - 2 లో

7 లో



సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల రిలే దీక్షలు

హోర్డింగ్‌లలో గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్‌కు ఏజెన్సీ వారు చెల్లించాల్సిన బకాయిలపై తొలుత చెక్కులు ఇవ్వడం తరువాత అధికారులను మ్యానేజ్ చేసుకుని చెక్కులు వెనక్కి తీసుకోవడం పరిపాటిగా మారిందని వైసిపి హయాంలో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు అధికారులపై ధ్వజమెత్తారు. అయినా నగర పాలక సంస్థ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. గతంలో పనిచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారులు కార్పొరేషన్‌కు హోర్డింగ్‌ల ద్వారా రూ.10 కోట్ల వరకు ఆదాయం రావాలని అంచనా వేయగా గత ఆరేళ్లల్లో గరిష్టంగా రూ.4 కోట్లు కూడా కార్పొరేషన్‌కు జమవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి రూ.కోట్లలో ప్రజల నుంచి దండుకుంటున్నా కార్పొరేషన్‌కు మాత్రం ఆదాయం రాకపోవడంపై ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధి సిపిఎం లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పోరాడుతుందన్నారు. మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులనూ కూటమి మోసం చేసిందన్నారు. పింఛన్ మినహా ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయ లేదని, హామీల అమలుపై కూటమి నాయకులను ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీలతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'పుష్ప-2'ను అడ్డుకుంటాం : రమేష్

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం)

పుష్ప-2 సినిమా ప్రీమియం షోను అడ్డుకుంటామని జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెగా ఫ్యామిలీ అండదండలతో సినిమా రంగంలో ఎదిగిన అల్లు అర్జున్, ఆ విషయం మర్చిపోయి మెగా ఫ్యామిలీపై నోరు పారేసుకోవడం సరికాదన్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ విషయంలో అల్లు అర్జున్ చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారని, అతని పోకడలను చిరంజీవి అభిమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, జనసేన కార్యకర్తల్లోనూ అతనిపై విపరీతమైన కోపం ఉందని తెలిపారు. పుష్ప-2 ప్రీమియం షో సినిమాను హనుమాన్ జంక్షన్‌లో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్, చిరంజీవి కుటుంబాలకు అల్లు అర్జున్ క్షమాపణ చెప్పాలన్నారు.

లంక గ్రామాల్లో పశువుల ఆశ్రయానికి నిర్మాణాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాబోయే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు జిల్లాలోని లంక గ్రామాలలో పశువుల ఆశ్రయ నిర్మాణాలు ఆవశ్యకమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర హోం మంత్రికి వివరించారు. బుధవారం రాష్ట్ర హోమ్‌మంత్రి వంగలపూడి అనిత వారి క్యాంప్ కార్యాలయం నుండి విపత్తుల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని రాష్ట్ర హోమ్ మంత్రి జిల్లా కలెక్టర్లకు సూచించగా, కష్ణా జిల్లాకు సంబంధించిన పరిస్థితులను కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతికూల వాతావరణం సమయంలో జిల్లా పరిధిలోని కష్ణానది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు ముందుకు రాలేదన్నారు. దీనికి ముఖ్య కారణాన్ని కలెక్టర్ వివరిస్తూ ఆయా గ్రామాలలోని ప్రజలు పశువులను కలిగి ఉండటం, ఆ సమయంలో వాటిని వదిలి వస్తే ఎమైపోతాయోనన్న ఆందోళనతో సురక్షిత ప్రాంతాలకు వారు రావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి పశువుల కోసం పశువుల ఆశ్రయాలు (క్యాటిల్ షెల్టర్స్) నిర్మిస్తే ఆ భరోసాతో ప్రజలు ముందుకు వస్తారని తెలిపారు.

ప్రాధాన్యతకు నోచని పాడిరైతులు

- ఖాళీగా ఏడీ, వైద్యులు, సిబ్బంది పోస్టులు
- మేతకు ఉపయోగపడే భూముల కబ్జా





ప్రజాశక్తి- మాచర్ల

రైతులకు వ్యవసాయం, పాడి అనేవి రెండు కళ్ల లాంటివి. వ్యవసాయంతో బాటు గ్రామీణ ప్రాంతంలోని రైతులు, కూలీలు పశుపోషణతో జీవనోపాధి పొందుతుంటారు. వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితులలో వారి కుటుంబ పోషణకు పశుసంపద ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రైతులకు, రైతు కూలీలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించే ఆదాయ వనరు. ఇంత ప్రాధాన్యం వున్న రంగం పట్ల ప్రభుత్వం ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. పశువైద్యానికి ప్రాధాన్యం ఇవ్వకపోవటంతో వారికి చాలా నష్టం జరుగుతోంది. ఒక మంచి గేదెను కొనాలంటే రూ.లక్ష అవుతుంది. దానితో ఒక సాదారణ కుటుంబం బతుకుతుంది. పట్టణ ప్రాంతాల్లో కూడా పశువుల ఫారాలు పెట్టుకొని జీవనాధారమైన పాడి పశువులను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. వాటికి జబ్బు సోకితే వైద్యం అందించే పశువైద్యాధికారులు, సిబ్బంది కొరత ఉంది. దాంతో వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సరైన వైద్యం అందక చనిపోతున్నాయి.

మాచర్ల పశువైద్యశాల ఎడి పరిధిలో మాచర్ల పట్టణం, మండలం, వెల్దుర్తి, దుర్గి మండలాలు వస్తాయి. ఎడి పరిధిలో 2 లక్షల పశుసంపద ఉన్నది. మాచర్ల పట్టణ, మండల పరిధిలో ఆవులు 7,172, బర్రెలు 16,076, గొర్రెలు 41,283, మేకలు 23,109, కోళ్ల 13,373 మొత్తం 1,01,013 పశుసంపద ఉంది. దుర్గి మండల పరిధిలో ఆవులు 2,358, బర్రెలు 6,560, గొర్రెలు 6,365, మేకలు 8.463, కోళ్ళు 2,765 మొత్తం 26,511, వెల్దుర్తి మండలంలో ఆవులు 4,562, బర్రెలు 9,890, గొర్రెలు 22,731, మేకలు 14,901, కోళ్ళు 4,659 మొత్తం 56, 743 పశుసంపద కలిగి ఉన్నది.

మాచర్ల, దుర్గి మండలాల పరిధిలో 2 చొప్పున, వెల్దుర్తి మండలంలో 3 పశు వైద్యశాలలు ఉన్నాయి. ప్రధానమైన మాచర్ల వైద్యశాల ఎడి పోస్టు ఖాళీగా ఉంది. వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలోని పశువుల ఆసుపత్రికి డాక్టర్ లేరు. మాచర్లలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. దాంతో పశువులకు సరైన వైద్యం అందటం లేదు. పశుసంపదకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అధ్యయనం చేస్తూ వాటికి అవసరమైన మందులును సరఫరా చేస్తూ పశుసంపదను పోషించే వారికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉండాలని పాడిరైతులు కోరుతున్నారు. గతంలో గ్రామాల్లో పశువులను మేముకునేందుకు కొంత బీడు భూములుండేవి, వాటిని అక్రమార్కులు పట్టా భూములుగా మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో పశువులను పోషించేందుకు కావాల్సిన సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలని పాడిరైతులు కోరుతున్నారు.

లంక గ్రామాల్లో షెల్టర్లు ఏర్పాటు చేయాలి

హోం మంత్రికి వివరించిన గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో భారీవర్షాలు, వరదలు వంటి విపత్తుల సమయంలో లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలతో పాటు పశువులను రక్షిత ప్రాంతాల్లోకి తరలించేలా ముందస్తుగా షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనితకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలో విపత్తుల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో హోం మంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు జిల్లాలోని లంక గ్రామాల్లో ప్రజలు రెండవ ప్రమాద హెచ్చరిక జారీచేసినా, జిల్లా యంత్రాంగం హెచ్చరించినా గ్రామాల్లో పశువులను వదిలి పునరావస కేంద్రాలకు రావటానికి సిద్ధమవడం లేదని చెప్పారు. రక్షిత ప్రాంతాల్లో షెల్టర్లను ఏర్పాటు చేసి పశువులను ముందుగా తరలిస్తే ప్రజలు పునరావస కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో వరద ముంపు సమయంలో ప్రమాద హెచ్చరికలు చేస్తూ నిరంతరం సైరైన్ మోగించేలా ఏర్పాట్లు చేయటం ద్వారా ప్రజలలో కొంత అవగాహన కలిగి పునరావస కేంద్రాలకు వస్తారన్నారు. వరద సమయంలో సహాయ కార్యక్రమాలకు అవసరమైన లైఫ్ జాకెట్లు, రోప్స్, ఆస్కా లైట్లు, లైఫ్ బోట్లు తదితర సామగ్రి అగ్నిమాపక శాఖకు అందిస్తే ప్రాథమికంగా సహాయ చర్యలు చేపట్టాడానికి ఉపయోగంగా ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు రాష్ట్ర కార్యాలయానికి అందించామని తెలిపారు. జిల్లాలో ఉన్న 67 రెయిన్ గేజ్‌లలో 29 పని చేయట్లేదని, వాటికి మరమ్మతులు చేయించాలని తెలిపారు. జిల్లాలో పడవల లభ్యత తక్కువుగా ఉందని, వివిద అవసరాలకు పడవలు వినియోగించేవారికి డ్రైవర్ లైసెన్స్‌లు, పడవల కొనుగోలుకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని హోం మంత్రి వగలపూడి అనితకు కలెక్టర్ వివరించారు.

మిల్లర్లు మద్దతు ధరకు కొనకుంటే కేసులు

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్



మోపిదేవిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయని రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. బుధవారం అవనిగడ్డలోని రెవెన్యూ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొందరు దళారులు, మిల్లర్లు అలజడి సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటికే రాష్ట్రంలో రూ 280 కోట్ల ఖరీదు చేసే ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. కృష్ణాజిల్లాలో 1.24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో 93 శాతం మందికి సొమ్ము చెల్లించినట్లు మంత్రి చెప్పారు. కౌలు రైతులకు కూడా ఈ క్రాప్ నమోదు చేసి ధాన్యం సొమ్ము నేరుగా వారి ఖాతాలకే జమ చేస్తున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు రైతులు తమకు నచ్చిన మిల్లుకే ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించడంతోపాటు జీపీఎస్ నిబంధన కూడా తొలగించామన్నారు డ్రై య ర్ల సౌకర్యం ఉన్న మిల్లులకు కింటాకు తొమ్మిది రూపాయలు ఎఫ్సీఐ ద్వారా నిధులు అందిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సాప్ సేవలు వినియోగించుకొని 73373 593 75 నెంబర్‌కు రైతు హాయ్ అని ఫోన్ చేస్తే అధికారులే రైతు వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేసే సౌకర్యం తెచ్చినట్లు తెలిపారు. రైతు పండించిన 1262 రకం ధాన్యం మొత్తం మిల్లర్లు కొనాలని మంత్రి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది ప్రతిరోజూ తప్పనిసరిగా ఐదారు గంటల క్షేత్రస్థాయిలో తిరిగి రైతులకు సహకరించాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్ రామ్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ బోడపాటి శివ దత్తు, ఏపీ ఐసీసీ డైరెక్టర్ మండలి రాజేష్, డిఎస్ఓ వి పార్వతి ఆర్డీవో కే స్వాతి, సివిల్ సప్లై డిఎం పద్మరాణి పాల్గొన్నారు

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం పెదప్రోలులో రైతులతో మాట్లాడారు. తమ తోటి రైతులు ధాన్యం ప్రభుత్వానికి డబ్బులు పడ్డాయని చెబుతున్నప్పుడు మంత్రి వారితో కలిసి సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు మండల బుద్ధ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.చాంద్‌భాషా కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి బుధవారం అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా చాంద్‌భాషా మాట్లాడుతూ 35 సంవత్సరాల ప్రభుత్వ సర్వీసు చేసి కనీసం ఇంటి నిర్మాణం కూడా నోచుకోని ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వారికి గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరారు. ఈరోజు వరకూ ప్రభుత్వం కరువు భత్యం బకాయిలు చెల్లించట్లేదని, పిఆర్‌సి కూడా ప్రకటన చేయలేదని, కనీసం నగదు రహిత వైద్య చికిత్సపై కూడా ప్రకటన చేయలేదని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నెట్వర్క్ హాస్పిటల్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, నగదు రహిత వైద్య చికిత్స అందేవిధంగా కషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ నా పరిధిలో ఉన్నంతవరకు పూర్తి సహాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నెట్వర్క్ హాస్పిటల్ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీముల్లా శాఖదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, ఉపాధ్యక్షులు విజయబాబు, నగర శాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివారెడ్డి తదితరులున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని అబ్బినేనిగుంట పాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఐసిడిఎస్ పిడి ఎం ఉమాదేవి, ఎంఈఓ 2 పి జాకబ్ పరిశీలించారు. అంగన్వాడి కేంద్ర పరిధిలో ఉన్న పోషణ వాటికను తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు పరిశీలించారు. పనులు త్వరితగతిన



పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సిడిపిఓ వి సుజాత దేవి ఏసిడిపిఓ సి హెచ్ విజయనిర్మల, సెక్టార్ సూపర్వైజర్ వి అరుణ, అంగన్వాడి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌కు అంగన్వాడీల విరాళం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ప్రాజెక్ట్ అంగన్ వాడి వర్కర్స్ ముఖ్యమంత్రి సహాయనిధి కోసం విరాళాలు సేకరించి, బుధవారం స్థానిక మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. రూ.1,01,116 చెక్ ని మంత్రికి అందజేశారు. అలాగే, తమ సమస్యలను ఆయనకు వివరించారు. తమకు ఇచ్చే జీతాలు సరిపోవడంలేదని తెలిపారు. జీతాలు పెంచమని కోరారు. ఒక వినతి పత్రం కూడా మంత్రికి అందజేశారు. మంత్రి లోకేష్ వారి సమస్యలను పరిష్కరిస్తామని అని వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో అంగన్ వాడి వర్కర్స్ బండారు కల్యాణి, చెరుకు వినీల, కె.హేమలత, సుహాసిని తదితరులు ఉన్నారు.

8న జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జిల్లా నెట్ బాల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు సబ్ జూనియర్ బాలబాలికల నెట్ బాల్ జట్లు ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 8న తెనాలి చెంచుపేట, ఇండోర్ స్టేడియంలో ఉదయం 8గంటలు నుంచి ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్, స్టడీ సర్టిఫికెట్టుతో హాజరు కాగలరన్నారు. ఎంపికలో 31/12/2008 తరువాత జన్మించిన క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరింత సమాచారానికి ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు డి నాగరాజు, జె సుధాకర్ లను 996334731, 9177167740 నంబర్లు ద్వారా సంప్రదించవచ్చున్నారు.

రేపటి నుండి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని ప్రతి గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కొరకు గ్రామ సభలు నిర్వహించడానికి షెడ్యూల్ ను బుధవారం మండల తహసీల్దార్ పి శంకర్ బాబు విడుదల చేశారు. డిసెంబర్ ఆరవ తారీఖు నుండి జనవరి రెండవ తేదీ వరకు మండలంలోని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలియజేశారు. రెవెన్యూ గ్రామసభ జరుగు గ్రామంలో రెండు రోజులు ముందుగా కరపత్రాలు, మైకు ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సభలలో సంబంధిత అధికారులు అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గ్రామస్థాయిలో భూ సంబంధిత సమస్యలు పరిష్కారం చేయాలనే ప్రాథమిక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ డిసెంబర్ 6 నుండి 28 వరకు తాడేపల్లి మండల పరిధి లోని వివిధ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి మండల తహశీల్దార్ డి సీతారామయ్య బుదవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ వడ్డేశ్వరం గ్రామ సచివాలయంలో ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు,10 వ తేది ఇప్పటంలో 11వ తేదీ మెల్లెంపూడి, 12వ తేదీ కుంచనపల్లి, 17 తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం పద్మశాలి బజార్(అర్బన్), 19 ఉండవల్లి 2 గ్రామ సచివాలయం, 21వ తేదీ పెనుమాక గ్రామ సచివాలయం 1, 24 కొలనుకొండ 26వ తేదీ గుండి మెడ గ్రామం సచివాలయం, 27వ తేదీ ప్రాతూరు 28వ తేదీ చిర్రావూరులో గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తాడేపల్లి మండల తహశీల్దార్ తెలిపారు.

మంత్రి లోకేష్‌కు ఎపిసిబిఇఎ నాయకుల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

ఉండవల్లి ముఖ్యమంత్రి నివాసంలో రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ను బుధవారం ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎన్టీయూసీ) నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ మంత్రి లోకేష్ కు గత ప్రభుత్వంలో అసోసియేషన్ లో ఉన్న ఉద్యోగులను పెట్టిన ఇబ్బందులను, ట్రేడ్ యూనియన్‌కు వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన వారి గురించి, గత నెలలో ఏలూరులో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో కృష్ణా, కడప అసోసియేషన్ లను స్టేట్ అసోసియేషన్ నుండి గుర్తింపు రద్దు చేసిన విషయంతో పాటు తదితర సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాత్రమే గుర్తించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని ఆయన అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సుంకర శ్రీనివాసన్, ఉప ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాస్, కోశాధికారి డీ శ్రీనివాస్ మంత్రి లోకేష్ ను కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి లోకేష్ కలిసిన ఏపీ సిబిఇఎ నాయకులు

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి (కష్ణ కెనాల్ జంక్షన్) రైల్వే ట్రాక్ పై 40 సంవత్సరాలు వయసు గుర్తుతెలియని పురుషుని మృత దేహాన్ని జి ఆర్ పి ఎస్ పోలీసులు బుధవారం కనుగొన్నారు. మృతుని ఒంటిపై నలుపు, ఎరుపు రంగులు గల టీ షర్టు మరియు నలుపు, గచ్చకాయ కలర్ సిమెంట్ ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సిఐ జి అంజిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు రైలు ఢీ కొట్టిందా, లేక మరేదైనా కారణమా అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్‌స్నాచర్‌ను అడ్డుకున్న మహిళ

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ మహిళ మెడలో చైన్ తెంచుకొని పోవడానికి గుర్తుతెలియని అగంతకుడు ప్రయత్నించిన సంఘటన తాడేపల్లి కొత్తూరులో బుధవారం జరిగింది. కొత్తూరు చెందిన శ్రీనివాస్ రెడ్డి భార్య తన ఇంటి ముందు షాపు వద్ద నిలబడి ఉండగా, అటుగా బైక్ పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి కొద్దిసేపు అక్కడ ఉన్నట్లు నటించి మహిళ మెడలోని గొలుసు తెంచుకొని పారిపోవటానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో దొంగ ప్రయత్నం విఫలమై తన బండి మీద పలాయానం చిత్తగించాడు. కొంతమంది యువకులు దొంగను వెంటబడిన దొరక్కుండా పారిపోయాడు. మాజీ సీఎం జగన్ ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తే దొంగ ఆనవాలు తెలిసే అవకాశం ఉంది. ఇటీవల తాడేపల్లి, ఉండవల్లి ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్లు తగు ముఖం పట్టాయి. బుధవారం మరల ఈ ఘటన చోటు చేసుకోవడంతో మహిళల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

8మంది గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలం పిడపర్తి పాలెం కృష్ణా నదిలోని పుష్కర ఘాట్ వద్ద బుధవారం గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి రూరల్ సిఐ బెల్లంకొండ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గంజాయి సేవిస్తూ, విక్రయాలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుండి రూ.3వేల నగదు, 2.270 గ్రాములు గంజాయిని , ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ దాడులలో కొల్లిపర ఏఎస్ఐ పోతురాజు కానిస్టేబుళ్ల నాగబాబు తాతారావు పాల్గొన్నారు.

ఇద్దరు జీవాల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గొర్రెల అపహరణ పై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా కేశవపూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు గొర్రెలను మేపేందుకు సత్తెనపల్లి మండలం కందుల వారిపాలెం వచ్చారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం మూడు గొర్రెలను అపహరించుకు పోయారు. ఈమేరకు గొర్రెల కాపరి మణికొండ శ్రీకాంత్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన అన్నపరెడ్డి రవి, ఒంటిపులి, మహేష్ దత్తులు గొర్రెలను దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో రవి, మహేష్ లను బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ అమిరుద్దీన్ తెలిపారు. తప్పించుకున్న దత్తును త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

ముగిసిన పల్నాటి వీరారాధన ఉత్సవాలు

వీరుల దేవాలయం అభివృద్ధి కోసం సిఎం, పర్యాటకశాఖ మంత్రిని కలుస్తామని ఇన్‌ఛార్జి మంత్రి హామీ





వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యే, ఇతర నాయకులు

ప్రజాశక్తి - కారంపూడి

ఎంతో ఘనమైన పల్నాడు చరిత్రను దేశ నలుమూలలా విస్తరించేలా కృషి చేస్తామని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాటి ఉత్సవాల్లో చివరి రోజైన కల్లిపాడు కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 900 ఏళ్ల చరిత్ర కలిగిన పల్నాటి ఉత్సవాలకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. సమసమాజ స్థాపన కోసం బ్రహ్మనాయుడు కుల, మతలకు అతీతంగా ఆ రోజుల్లోనే సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పల్నాడు యుద్ధం జరిగిన కారంపూడిలోని వీర్ల గుడి అభివృద్ధికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి త్వరలోనే ముఖ్యమంత్రి, టూరిజం మంత్రిని కలుస్తామని చెప్పారు. అనంతరం వీరుల దేవాలయం, అంకాళమ్మ, చెన్నకేశవ దేవాలయలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, జూలకంటి బ్రహ్మానందరెడ్డితో పాటు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజషన్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పల్నాటి ఉత్సవాల సందర్భంగా ఐదవ రోజు జరిగే ఎడ్ల పోటీలను మంత్రి ప్రారంభించారు. అనంతరం జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, నాయకులు కె.శివారెడ్డి, వై.కేశవరెడ్డి, పి.అంజయ్య, పి.పుల్లయ్య, యు.లక్ష్మీనారాయణ, జి.సురేష్ యాదవ్, రాము, శ్రీనివాసరావు, సత్యం, రామాంజనేయులు, సైదారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇతరుల భూముల జోలికెళ్లాలంటేనే భయపడేలా చట్టం : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ



పరాయి వాళ్ల భూములపై కన్నేయాలంటనే బయపడేలా సమగ్ర భూ కబ్జాల నియంత్రణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తెచ్చిందని ప్రభుత్వ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. భూహక్కుల సమస్యల్లేని రెవెన్యూ నిర్వహణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వినుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భూ ఆక్రమణలు, రెవెన్యూ రికార్డుల్ని వైసిపి ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని, వీటన్నింటినీ సరిచేయడానికి ఈ శుక్రవారం నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ అధికారులు గ్రామాలకు వస్తారని, సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరిస్తారని తెలిపారు. ఇదిలా ఉండగా టిడిపి సభ్యత్వ నమోదులో 84 వేలు దాటి రాష్ట్రంలో 4వ స్థానంలో వినుకొండ నిలిచిందని చెప్పారు. పారా లక్ష్మయ్యకు రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మయ్యను సన్మానించారు. వినుకొండ సహా పల్నాడు జిల్లాలో పశు సంపద ఎక్కువని, ఈ రంగంలో అనుభవం ఉన్న లక్ష్మయ్య పశుసంవర్ధక శాఖలో గొప్ప మార్పులు తీసుకొస్తారని ఆకాంక్షించారు.

భూ సమస్యలపై రేపటి నుండి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-ఈపూరు

గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలపై శుక్రవారం నుండి వచ్చేనెల 4 వరకు రెవెన్యూ సదస్సులను గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎ.నళిని బుధవారం తెలిపారు. 6వ తేదీన ఈపూరు,10న వనికుంట, 12న అగ్గిగుండాల, 17న ఎ.ముప్పాళ్ల, 19న చిట్టాపురం, 21న కొచ్చర్ల, 24న కొండ్రముట్ల, దాసులపల్లి, 27న కొండాయపాలెం, 31న అంగలూరు, గుండేపల్లి, 2న బొమ్మరాజుపల్లి, జనవరి 4న ఇనిమెళ్లలో సదస్సులు ఉంటాయన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

నర్సింగ్ చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపిఎస్-ఎస్‌డిసి), ఓంకాప్, క్యూరా పర్సనల్ సంయుక్త ఆధ్వర్యంలో జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్ చదువుకున్నటు వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గుంటూరులో శిక్షణ ఉంటుందని, శిక్షణ వ్యవధి 6 నెలలు, రోజుకు ఏడు గంటల పాటు క్లాసులు జరుగుతాయని పేర్కొన్నారు. శిక్షణ రుసుం రూ.75 వేలని, వీసా పొందిన తరువాత తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం 9988853335 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పరిధిలోని 9 ఐసిడిఎస్ కార్యాలయాల పరిధిలో 22 అంగన్వాడి కార్యకర్తలు, 1 మినీ అంగన్వాడి కార్యకర్త 114 అంగన్వాడి హెల్పర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పీడీ కె.ఉమారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 తరగతి ఉత్తీర్ణత లేదా ఆపై విద్యార్హత కలిగి సంబంధిత గ్రామ వివాహిత మహిళలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు సిడిపిఒ కార్యాలయంలో శుక్రవారం నుండి 18 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైల్వేలో కార్మిక సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు పొందిన కార్మిక సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గుంటూరు డివిజన్ పరిధిలో బుధవారం యూనియన్ ఎన్నికలు జరిగాయి. సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిరిపురం నుండి బెల్లంకొండ రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్యాంగ్ మెన్ నుండి గెట్ మెన్‌లు, లోకో పైలట్‌లు, స్టేషన్ మాస్టర్లతో పాటు వివిధ హోదాల్లో పనిచేసిన ఉద్యోగులు ఓటింగ్ లో పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌ల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 190 ఓట్లకు గాను 123 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి ఎల్‌విఆర్ శాస్త్రి తెలిపారు. గురువారం కూడా పోలింగ్ జరుగుతుందని చెప్పారు. వివిధ యూనియన్లకు చెందిన నాయకులు కె.వెంకటరెడ్డి, కొండానాయక్, ఏసుబాబు (ఎస్‌సిఆర్ఎమ్‌యూ), సిహెచ్. వేణుగోపాల్, బి.నరేష్, రావిపాటి నరేంద్రబాబు (ఎస్‌సి ఆర్ఇఎస్) పోలింగ్ సరళిని పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వే పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



బందోబస్తు విధుల్లో రైల్వే పోలీసులు



ఉపాధి హామీ పనులపై క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి - క్రోసూరు

ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు అధికారులు దృష్టి సారించాలని, ఆ దిశగా ఉపాధి హామీ పనులు గుర్తించాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న వారు అడిగిన వెంటనే పని కల్పించాలన్నారు. కనీసం వేతనం వచ్చే లాగా కొలతలు ప్రకారం పని చేయించాలని సూచించారు. పండ్ల తోటలు సర్వైవల్ క్యాప్చర్ చేయాలని, జాబ్ కార్డులు కావాల్సిన వారికి ఇవ్వాలని ఆదేశించారు. మస్టర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, తాము ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారు. పనుల్లో అవకతవకలను సహించబోమన్నారు. సమీక్షలో ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యా రంగంలో అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి : యుటిఎఫ్

- పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారికి వినతి
- 11న డిఇఒ కార్యాలయం వద్ద, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నాలకు పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యా రంగంలో ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ అసంబద్ధ నిర్ణయాల రద్దు కోసం 11న అన్ని జిల్లా విద్యా శాఖ కార్యాలయాల వద్ద, 16న రాష్ట్ర విద్యా శాఖ కార్యాలయం వద్ద నిరసనలు చేపడతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ అధికారులు ఏ విధంగా వేధింపులకు పాల్పడ్డారో అదేతీరు కొనసాగుతోందని అన్నారు. పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు వంటి నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణ, విద్యార్థులకు ఒత్తిడి లేని నాణ్యమైన విద్యా బోధన యుటిఎఫ్ లక్ష్యమన్నారు. ఉపాధ్యాయులు బోధన పట్ల పూర్తి స్థాయిలో దృష్టి సారించాలంటే యాప్‌ల భారం లేకుండా చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎంఇఒలు సెలవులు మంజూరు చేయడం లేదని, అనారోగ్యం బారిన పడినవారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ పేరిట సెలవు దినాల్లో సైతం పనిచేయాలని ఉత్తర్వులు ఇవ్వడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.విజయసారథి, షేక్.ఖాసింపీరా, జె.వాల్యా నాయక్, ఎం.రవిబాబు, టి.వెంకటేశ్వర్లు, ఆర్.అజయ్‌బాబు, ఎ.నాసరరెడ్డి, ఉషా శౌరిరాణి, తిరుపతిస్వామి, జి.ఆంజనేయులు, పి.సత్యానందరావు, ఎల్.పూర్ణచంద్రరావు, కె.వెంకటేశ్వరరావు, ఒ.కోటేశ్వరరావు, లింగయ్య పాల్గొన్నారు.



పల్నాడు డిఇఒ చంద్రకళకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధ్యాయులపై మానసిక దాడి ఆపాలి

విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలపై యుటిఎఫ్ నిరసన - మండలాల్లో ఎంఇఒలకు నాయకుల వినతి

11న డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపు



తుళ్లూరులో ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులపై మానసిక దాడి ఆపాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం జిల్లాలో అన్ని మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులకు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్ రావు, యం.కళాధర్ మాట్లాడుతూ రకరకాల సమాచారం అప్లోడ్ చేయాలని, ప్రతిరోజు ఒత్తిడి చేయటం, ఒక పని పూర్తి కాకముందే మరొక పని ఇవ్వటం, పాఠశాల సమయం పెంపుపై గందరగోళం సష్టించటం, ఆదివారాలు కూడా తరగతులు నిర్వహించాలని ఆదేశించటం, 10 శాతం మించి ఉపాధ్యాయులకు సెలవు మంజూరు చేయొద్దని ఆదేశాలు ఇస్తూ ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఇది ఉపాధ్యాయులపై మానసిక దాడి చేయటమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం మిగిలిన విషయాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ విద్యా బోధన గురించి అసలు పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఉపాధ్యాయులు ఒత్తిడి లేని విద్యాబోధన చేసే వాతావరణం కల్పించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం వైఖరి మార్చుకొని టీచర్లపై బోధనేతర బాధ్యతలు తప్పించి బోధన బలోపేతానికి ప్రయత్నాలు చేయాలి కోరారు. లేనిపక్షంలో దీనిపై మరిన్ని పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు

ప్రజాశక్తి -తుళ్లూరు

విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు యు రాజశేఖరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి,ప్రస్తుత ప్రభుత్వానికి తేడా లేదనే విధంగా విద్యాశాఖాధికారుల నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. పాఠశాలల పనివేళల పెంపు,10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్ లో నమోదు లాంటి నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిందని ఆయన చెప్పారు.నిరసన కార్యక్రమం అనంతరం కార్యాలయంలో విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు పి వెంకటేశ్వర్లు,జిల్లా ఆడిట్ ఆడిట్ కమిటీ కన్వీనర్ అడివి శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి సిహెచ్ ఆదినారాయణ,పి శ్రీనివాసరావు,వి ప్రసాద్,ఆర్ ఇందుమతి,ఎ కళ్యాణ్, ఎన్ సుజాత కుమారి, కె నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్రంలో విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను నిరసిస్తూ మండల విద్యాశాఖ అధికారి సుబ్బారావుకి యుటిఎఫ్ మండల కమిటీ నాయకులు నోటీసు ఇవ్వడం జరిగిందని జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్రావు తెలిపారు. 11వ తేదీన గుంటూరు జిల్లా డీఈఓ ఆఫీస్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె విజయ రాజు, పి పార్థసారథి కోశాధికారి , కె శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు ఐ శ్రీనివాస్ రెడ్డి జిల్లా కౌన్సిలర్లు వై రమేష్ బాబు డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

విద్యాశాఖ అసంబద్ధత నిర్ణయాలు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నాయని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కేదార్నాథ్ అన్నారు. బుధవారం రాష్ట్ర యుటిఎఫ్ శాఖ పిలుపుమేరకు యుటిఎఫ్ కొల్లిపర మండల శాఖ ఆధ్వర్యంలో తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల విద్యాశాఖ అధికారి సాల్మన్ రాజుకు అందజేశారు ఈ సందర్భంగా కేదార్నాథ్, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు వరప్రతాప్ మాట్లాడుతూ 11వ తేదీన ఉపాధ్యాయులు తమ న్యాయమైన కోరిక నెరవేర్చుకునేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీస్ ఎదుట 16వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన జరుగుతాయని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎండి వహాబ్ కాలేశావళి సుగుణ కుమారి శ్యామల సూర్యకుమారి నాగమల్లేశ్వరి శ్రీరామ్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో వినతి పత్రం ఇస్తున్న నాయకులు



చేబ్రోలులో వినతి పత్రం ఇస్తున్న నాయకులు



కొల్లిపరలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : విద్యాశాఖ అధికారులు అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని కోరుతూ ప్రత్తిపాడు యూటీఎఫ్ శాఖ మండల విద్య వనరుల అధికారి కి బుధ వారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ గత 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ సంక్రాంతి సెలవుల్లో కూడా హై స్కలు ఉపాధ్యాయులు అందరూ పాఠశాలకు రావాలని చెప్పడం ఒత్తెద్దు పోకడ గా ఉంది. అనారోగ్యం బారిన పడినవారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్లో ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పనిచేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయి. కార్యక్రమం లో యూటీఫ్ ప్రత్తిపాడు మండల ప్రధాన కార్యదర్శి జి.రవి కుమార్, జిల్లా కార్యదర్శి ఎండీ షకీలా బేగం,జిల్లా అడిట్ సభ్యుడు కే.ప్రేమ్ కుమార్, మండల బద్యులు జీ.చంద్ర శేఖర్‌రెడ్డి, కే.వెంకట నారాయణ, ఎస్.అంకమ రావు, ఐ.సదశివరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని 173 గ్రామాలకుగాను తొమ్మిది మండలాల్లోని 62 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయిందని, ఈనెల 6వ తేది నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్‌కు తెలిపారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ నేపథ్యంలో బుధవారం మంగళగిరిలోని సీసీఎల్ఎ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి అనగాని సత్య ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ , డిఆర్ఒ ఖాజావలి , ఆర్‌డిఒ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హైస్ ట్యాక్స్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిపిఒ

స్వర్ణ పంచాయతీ సర్వే పరిశీలన

వెంగళాయపాలెంను సందర్శించిన డిపిఒ

ప్రజాశక్తి-గుంటూరు

స్వర్ణ పంచాయతీ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.నాగసాయికుమార్ ఆదేశించారు. బుధవారం డిపిఒ గుంటూరు రూరల్ మండలం, వెంగళయ పాలెం గ్రామపంచాయతీలో పర్యటించి, స్వర్ణ పంచాయతీ సర్వే, హౌస్‌ట్యాక్స్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామపంచాయతీలో వర్మీ కంపోస్ట్ తయారు చేయటానికి ఏర్పాటు చేసిన వర్మీ బెడ్స్‌లో వానపాములు వదిలారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ మండల ఈఒఆర్‌డి కె.శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ నల్లపాటి లలిత కుమారి, ఉప సర్పంచ్ మాధవిలత, 12వ వార్డు సభ్యులు వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ప్రతి వార్డునూ మోడల్‌గా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రూ.1.31 కోట్లతో రోడ్లు డ్రైన్లు నిర్మించి ప్రతి వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని గొలుసు కొండలరావు నగర్‌లో రూ.38.50లక్షలతో 2, 3 లైన్స్‌లో సిసి రోడ్డు, 1 లైన్లో సీసీ డ్రైన్, రూ.40 లక్షలతో 3, 4, 6 లైన్లో సీసీ రోడ్లు, రూ.53 లక్షలతో జున్నుషాద్నగర్ మెయిన్‌రోడ్, రూ.9లక్షలతో ఎ టు జెడ్ లైన్ సిసి రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలు నివసించే ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మించి వార్డులు అభివృద్ధిచేసి మోడల్ వార్డుగా మారుస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా 50-100 గజాల్లో ఇల్లు కట్టుకునే పేదలకి, బలహీన వర్గాల ప్రజలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని, అధికారులు ప్రజలను ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకొస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, షాజీలా, ఉస్మాన్, జమీర్, గాలి సతీష్, అనిల్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో అక్రమాలపై ఉక్కు పాదం : ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదల, బోగస్ గ్రూప్‌లతో డబ్బులు తిన్న సి.ఓ ల నుండి ఆర్పీల చిట్టా సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాల నిధుల విషయంలో ఇటీవల చాలా అక్రమాలు వెలుగు చూస్తున్నాయని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మాధవి మెప్మా అధికారుల అక్రమాల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 5 సంవత్సరాల్లో భారీగా అక్రమాలు జరిగాయని గుర్తిస్తున్నామని, ఇందులో ఎవరెవరి పాత్ర ఉన్నదో గుర్తిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పలు డివిజన్ లలో 100 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని చెప్తున్న సిఓ లు 20 మాత్రమే పేర్లు చూపిస్తున్నారని ఓ ఫిర్యాదు రావటంతో, మిగిలినవి 80 గ్రూపులు బొగస్ గ్రూపులు అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్పీలతో కలిసి బోగస్ గ్రూప్ లను ఏర్పాటు చేసి లక్షలు దండుకున్న వీరిని గుర్తించి శిక్షించబోతున్నాం అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న మహిళలను గ్రూప్ లుగా ఏర్పాటు చేసి అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే బ్యాంక్లలో రుణాలు తీసుకున్న విషయాన్ని కూడా గుర్తిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ అక్రమాల అన్నిటి పై ఉక్కు పాదం మోపుతున్నామని, నియోజకవర్గ పరిధిలో ఇలాంటివి ఎక్కడ కనిపించకూడదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆర్పిలు డబ్బులు డిమాండ్ చేస్తే డ్వాక్రా మహిళలు తనను నేరుగా సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు.



కొణిజేటి రోశయ్యకు పలువురు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, కర్ణాటక, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక పట్టాభిపురంలో రోశయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. రోశయ్య పరిపాలనాదక్షుడిగా, ఆర్థిక నిపుణుడిగా పేరు గడించారని అన్నారు. విద్యార్థి సంఘం నాయకుడి నుండి గవర్నర్ స్థాయికి ఎదిగారన్నారు.



నివాళి అర్పిస్తున్న దేగల ప్రభాకర్, తదితరులు

రేపు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

భారత రాజ్యాంగ సష్టికర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు మదర్ థెరీసా నగర్ విగ్రహ నిర్మాణ కమిటి అంబేద్కర్ యువజన సమాఖ్య తెలిపింది. బుధవారం చినరావూరు తోట 14వ వార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తొలుత స్థానిక కౌన్సిలర్ వీర వసంతరావు, ఎపిఎఫ్డిసి మాజి డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కమిటి సభ్యులు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. మన్నవ ప్రభాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 9 అడుగుల నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని చినరావూరు తోట, మదర్ థెరీసా నగర్‌లో స్థాపిస్తున్నట్లు తెలిపారు. 6న దళిత ఉద్యమకారులు డాక్టర్ కత్తి పద్మారావ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ వాదులు, విద్యావంతులు, మేధావులు మేధావులు, న్యాయవాదులు, ఉద్యోగులు, విద్యార్థులు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు విగ్రహావిష్కరణలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బోరుగడ్డ సురేష్ బాబు, రాజారత్నం, పి మోహన్ రావు, పి జాన్సన్, ఎం థామస్, కమిటి సభ్యులు పాల్గొన్నారు

గంజాయి, నేరాల నియంత్రణకు డ్రోన్లతో నిఘా

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో గంజాయి, నేరాల కట్టడికి డ్రోన్ కెమెరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని చిత్రాలయ సెంటర్, రైల్వే స్టేషన్, బస్టాండ్, హార్డ్ కాలేజీ, బీసీ కాలనీ ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. పల్నాడు జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి పోలీసు స్టేషను పరిధిలోనూ గంజాయి వినియోగం, విక్రయం జరిగేందుకు అవకాశం ఉన్న శివారు, నిశితమైన ప్రాంతాలను, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి వినియోగం, క్రయ విక్రయం, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైల్వే సవరణ బిల్లును టిడిపి పార్లమెంటరీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు బిల్లును స్వాగతించారు. ఆంధ్రరాష్ట్ర రాజధాని ప్రాంతాన్ని ప్రధాన మెట్రో నగరాలకు అనుసంధానం చేసే అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టుకు రూ 2,245 కోట్లతో ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికికతజ్ఞతలు తెలిపారు. పల్నాడు జిల్లాలోని ఆరు రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేర్చడాన్ని అభినందిస్తూ.. వీటి పురోగతిని ముందుకు తీసుకుని వెళ్లాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు నడికుడి-శ్రీకాళహస్తి, కడప-బెంగళూరు, రేణిగుంట-గూడూరు, కోటిపల్లి-నర్సాపూర్ లైన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నరసరావుపేటలో స్టాపేజితో గుంటూరు - బెంగళూరు మధ్య వందే భారత్ కనెక్టివిటీని ప్రవేశపెట్టాలని, కరోనా సమయంలో నిలిపిన రైల్వే స్టాప్‌లను పునరుద్ధరించాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కోసం 24 రైల్వే అండర్‌పాస్‌లను ఓవర్‌పాస్‌లుగా మార్చడానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీవో బి.అరుణ బుధవారం తెలిపారు. బొల్లాపల్లి మండలంలోని గుమ్మనంపాడు(ఎస్సీ), పేరూరు పాడు(ఎస్టీ), ఈపూరు మండలంలోని ఊడిజర్ల (జనరల్), ఈపూరు (బిసి-బి), అంగలూరు (ఎస్సీ), వనికుంట (బిసి- డి) ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 18వవ తేదీలోగా ఈపూరు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండలం ధరణికోటలోని మన్నా చర్చి ఆధ్వర్యంలో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి లావు మేఘన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు పాస్టర్లకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- ప్రజల్లో విశ్వాసం పెంచేలా అధికారులు పని చేయాలి
- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెవెన్యూ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా, ప్రజల్లో విశ్వాసం పొందేలా రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు 33 రోజులు పాటు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సచివాలయం నుంచి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా, సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మిలతో కలిసి సదస్సుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం సూచనల మేరకు షెడ్యూల్ ప్రకారం సదస్సులు నిర్వహించాలన్నారు.

నియోజకవర్గానికి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు. జిల్లాలో మొత్తం 366 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, అందులో 150 గ్రామాలలో భూముల రీ -సర్వే ప్రక్రియ పూర్తయిందని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వివరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సూరజ్ గనోరే పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి..
- ఎం.సి.హెచ్ అదనపు డైరెక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని.. తద్వారా మాతాశిశు మరణాల నివారణకు వైద్యులు కషి చేయాలని ఎం.సి. హెచ్ అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ సూచించారు. పల్నాడు జిల్లాలో గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి తెలుసుకునేందుకు ఆయన నరసరావుపేట, చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, ఔషధ పంపిణీ కేంద్రాన్ని, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా పేదలకు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకం పెంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆర్.సి.హెచ్ పైలెట్ ప్రాజెక్టు



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డైరెక్టర్ అనిల్‌కుమార్

కింద అందిస్తున్న సేవలను ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇమ్యునైజేషన్ మోడల్ ఆఫీసర్ డాక్టర్ దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, ఆయా శాఖల జిల్లా అధికారులు డాక్టర్ పద్మావతి, గీతాంజలి, హనుమకుమార్, నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

రోశయ్య సేవలు ఎనలేనివి



రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా



ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ.. రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, మద్ది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు రోశయ్య

ప్రజాశక్తి - క్రోసూరు

సాధారణ స్థాయి నుంచి రాష్ట్ర గవర్నర్ స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి కొణిజేటి రోశయ్య అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని క్రోసూరు వాసవి క్లబ్ వాసవియన్ గుగ్గిలం విజయ శేఖర్, ప్రోగ్రాం అధికారి కట్టమూరు అప్పారావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు తొమ్మండ్రు నాగేశ్వరావు, అనుమాల పూర్ణచంద్రరావు, తొమ్మండ్రు వాసంతి , కట్టమూరి చెన్నకేసరిదేవి, గుగ్గిలం గాయత్రి, కూరపాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అజాతశత్రువు రోశయ్య

ప్రజాశక్తి - మాచర్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం మాచర్ల



పట్టణంలో నిర్వహించారు. మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు తదితరులు రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రాజకీయాల్లో రోశయ్య అజాతశత్రువుగా పేరుగాంచారన్నారు. ఏ రోజు కూడా తనకు ఈ పదవి కావాలని రోశయ్య అడగలేదని గుర్తు చేశారు. పార్టీ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ వల్లే పదవులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేత సూరె యలమంద, కజ్జం సైదయ్య, భవనాశి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



రహదారి మరమ్మతుల పరిశీలన

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారి మరమ్మతు పనులను బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, నాణ్యత ఉండాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఈయన వెంట ఏఈ యూసఫ్ ఉన్నారు.



రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రైతులు ఈ నెల 31తేదీలోపు రబీ సీజన్ బీమా ప్రీమియం చెల్లించేందుకు అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి డి.పాపకుమారి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మాదినపాడు, కేసానుపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. మిర్చి పంటలో వచ్చే తెగుళ్లను ఎలా అరికట్టాలో వివరించారు. జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, ధర క్వింటాకు రూ.7,521 ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.



ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యడ్లపాడు

గుడ్ షెఫర్డ్ యునైటెడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుదవారం మండలంలోని తిమ్మాపురంలో ఉన్న యెహోవా యీరే ప్రార్థన మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు, స్థానిక శాంతినిలయం పాస్టర్ బ్రదర్ కష్టార్ పాల్గొని ప్రత్యేక క్రిస్మస్ సందేశం వినిపించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన బూసి ప్రసాద రావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు పత్తిపాటి ఎలీషా, కార్యదర్శి కొమ్ము ఇమ్మనియేల్, పత్తిపాటి హెూహన్, ట్రెజరర్ అల్లడి కరుణానిధి, జీవన్ పాల్, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల రిలే దీక్షలు

➤ పలు కార్మిక సంఘాల మద్దతు



దీక్షలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన న్యాయమైన బకాయిల కోసం కార్మికులు బుధవారం నుంచి రిలే దీక్షలు ప్రారంభించారు. దీక్షలను వైసీపీ ఎంటీఎంసీ నగర అధ్యక్షులు దొంతరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, దర్శ రమేష్, ఐ.ఎఫ్.టి.యు నాయకులు యు.నాగేశ్వరరావు, కె.కోటయ్య, ఏఐటీయూసీ నాయకులు కంచర్ల కాశయ్య, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు వేముల దుర్గారావు, బోరగా వెంకటేశ్వర్లు, జొన్న శివశంకర్ రావు, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రక టించారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని సూచిం చారు. స్థానిక ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ అధికారులు కార్మికుల గుడిసెలు తొలగించడం అన్యాయమన్నారు. కార్మికుల దీక్షలకు ప్రజా మద్దతును కూడా కూడగడతామని తెలిపారు. దీక్షలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, ఎస్కే బాషా, యెహొషువ, పిలై కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, సాంబశివరావు, ఎం.గురవయ్య, సుబ్బారావు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



తగ్గుతున్న పసుపు ధరలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో బుధవారం పసుపు ధరలు తగ్గాయి. సంవత్సరం తర్వాత పదివేల రూపాయల దిగువకు ధరలు రావడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అనూహ్యంగా పెరిగిన ధర.. క్వింటా రూ.16 వేలకు చేరింది. ప్రస్తుతం మరో రెండు నెలల్లో కొత్త పంట నిజామాబాద్ యార్డుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో దుగ్గిరాలయార్డుకు పంట వస్తుంది. కొత్త పంట అమ్మకానికి వచ్చే నాటికి ధరలు తగ్గటం మామూలే. బుధవారం కనిష్ట ధర క్వింటా రూ.9,550, గరిష్ట ధర రూ.11,250గా ఉంది. ఇదే మంగళవారం ధరలు కనిష్ట రూ.11,250.. గరిష్ట ధర 11,700గా ఉంది. సగటు ధర రూ.11,400 పలికింది. దీంతో రెండు రోజుల్లోనే ధర భారీగా పతనమైంది.



డీఈవో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని కేకే ఎంపీఎల్ హై స్కూల్ ను డీఈవో రేణుక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఎస్ఏఎస్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసరావు, బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె దర్యావాలి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నారై కళాశాలలో దంత వైద్యశిబిరం


ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరు, లక్ష్మీపురం ఆస్ట్రేలియన్ డెంటల్ క్లినిక్ వైద్య సిబ్బంది పాల్గొని సేవలందించారు. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు రావిపాటి మాట్లాడుతూ.. ప్రస్తుతం దంతాల సమస్య సర్వసాధారణమైందని, భారత దేశంలో 50 శాతం మంది దంత సమస్యలతో బాధపడుతూ వైద్యుల్ని సంప్రదిస్తున్నట్లు తెలిపారు. నోరు, నాలుక వాపు వంటి తీవ్రమైన అనారోగ్యాలు కూడా దంత సమస్యలకు కారణమని చెప్పారు. డాక్టర్ వేలేటి విష్ణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు రెండుసార్లు బ్రష్ చేసే అలవాటు చేసుకోవాలని సూచించారు. నోటి దుర్వాసన వస్తే దంత సమస్యలకు సంకేతమని, వెంటనే దగ్గరలో ఉన్న వైద్యులను సంప్రదించాలని తెలిపారు. విద్యార్థుల్లో వచ్చే దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. సుమారు 200 మంది విద్యార్థులకు దంతాలను పరీక్షించి మందులు, పేస్టులు, మౌత్ ఫ్రెష్ లు ఉచితంగా అందజేశారు.కార్యక్రమంలో డాక్టర్ అచ్యుత్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, క్లినిక్ మేనేజర్ బి.పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

అక్రమంగా సస్పెండ్ చేశారు..

ప్రజాశక్తి-తాడేపల్లి

గత ప్రభుత్వంలో మాజీమంత్రి విడుదల రజని అండతో నాడు- నేడు పనుల్లో తనను బాధ్యుడిగా చేసి సస్పెండ్ చేశారని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన స్కూలు అసిస్టెంట్ వి. వీరయ్య వాపోయాడు. బుధవారం మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ఉండవల్లి ప్రజాదర్బార్లో అర్జీ అందజేశారు. అప్పటి డీఈవో, ఎంఈఓ మంత్రిని ప్రభావితం చేసి, తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులరైజ్ చేసి, ఆన్ డ్యూటీ జీతభత్యాలు చెల్లించాలని కోరాడు. 49 వ రోజుకు చేరిన ప్రజాదర్బార్లో.. బాధితులకు అండగా ఉంటానని, సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. రాష్ట్ర గహ నిర్మాణ సంస్థలో 19 ఏళ్ల అవుట్సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న ఐటి, మేనేజర్, ఏఈ, ఎంఐసి, వర్క్ ఇన్స్పెక్టర్లు, డీఈ లు, అటెండర్ స్థాయి వారిని కాంట్రాక్ట్ సర్వీస్‌లోకి మార్చాలని జాయింట్ యాక్షన్ కమిటీ మంత్రి లోకేష్ కి విజ్ఞప్తి చేసింది.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్

➤ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు

ఏలూరు జిల్లా చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని బుట్టాయిగూడెం, రెడ్డి గణపవరం ఏజెన్సీ రైతులు కోరారు. వైసిపి అండతో తమ భూములను అక్రమంగా లాగేసుకున్నారని, తనకు న్యాయం చేయాలని అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం, సానిపాయ గ్రామానికి చెందిన చిన్నప్ప విజ్ఞప్తి చేశాడు. గోపాలమిత్రలు సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నంబర్ 48ను తిరిగి పునరుద్ధరించి అమలు చేయాలని పలువురు ఉద్యోగులు కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో కేఎల్ యూనివర్సిటీ నుంచి రేవేంద్రపాడు వరకు గుంతలు పడి, పాడైపోయిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన



ప్రజాశక్తి-తెనాలిరూరల్

కాలువల్లో పేరుకుపోయిన మురుగు సమస్యలపై తెనాలి మున్సిపల్ ఛైర్పర్సన్ తాడిబొయిన రాధిక ప్రత్యేక శ్రద్ధ వహించారు. బుధవారం 23వ వార్డులో పారిశుధ్య సమస్యలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. కాల్వల్లో పేరుకుపోయిన పూడికలను కార్మికులతో తీయించారు. పారిశుధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించి, సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా చేసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎం.లక్ష్మీపతి రావు, ఎంహెచ్ఓ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఎం.సాంబశివరావు, అసిస్టెంట్ ఇంజనీర్ బి.సునీల్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాలయాలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి టి.వి.విజయలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు మండలం, లేమల్లెపాడు మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రతి గదిని, గ్రంథాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు, పరిసరాలను కూడా పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దడం అభినందనీయం కొనియాడారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన 'వికాస'

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఉద్యోగ సంఘం (వికాస) బుధవారం బాధ్యతలు స్వీకరించింది. వికాస భవన్ లో జరిగిన కార్యక్రమంలో పూర్వ కార్యవర్గం నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులను సన్మానించారు. వర్శిటీ అభివద్ధికి అవసరమైన మార్గదర్శకాలను అను సరించాలని వికాస కార్యవర్గానికి వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్. ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.వి. ప్రకాష్, కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, కోశాధికారి కె. యేషయా, సంయుక్త కార్యదర్శులు నేలపాటి నాగేశ్వ రరావు, వెంకటేష్, కార్యవర్గ సభ్యులు జి.శ్రీను, శశిధర్, పి.నాగరాజు ఎన్.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టికెట్ల పేరుతో దోపిడీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రజల ధనాన్ని సినిమా టికెట్ల రూపంలో దోపిడీ చేస్తున్న ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నట్లు తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివద్ధి సంఘం అధ్యక్షులు దరిశ శివ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా విడుదలవుతున్న పుష్ప-2 సినిమా టికెట్ల ధరలు అమాంతం తారస్థాయికి చేరుకున్నాయన్నారు. ఎన్నడూ లేనివిధంగా థియేటర్ల యాజమాన్యం స్పెషల్ షో పేరుతో ప్రేక్షకుల నుంచి రూ.950 వసూలు చేస్తున్నాయని తెలిపారు. కొత్త సినిమాలకు టికెట్ల ధరలు పెంచుకోవచ్చని ప్రభుత్వమే ఉత్తర్వులు జారీచేయడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం తీరుపై సినీ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నారాయణం కమల్ కుమార్, అబ్దుల్ ఆరిఫ్, రావూరి శివశంకరరావు, సోమయ్య శాస్త్రి, లక్కరాజు చిరంజీవి పాల్గొన్నారు.

ఏకపాత్రాభినయం, పాటల పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి : సీపీఐ శతవసంతాలు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య తెలిపారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు సీనియర్ కళాకారులు సందుపట్ల భూపతి మాట్లాడారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా కళాకారులను ప్రోత్సహించేలా ఈ నెల 8వ తేదీన ఉదయం తొమ్మిది గంటలకు గుంటూరు కొత్తపేట పార్టీ కార్యాలయం వద్ద పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సైకిల్ షాప్ నిర్వాహకుడి నిజాయితీ

ప్రజాశక్తి-తాడేపల్లి



తన బాంక్ ఖాతాకు పొరపాటున జమైన రూ.లక్ష నగదును.. తిరిగి అసలు యజమానికి అందజేసి ఓ సైకిల్ షాప్ మెకానిక్ తన నిజాయితీ చాటుకున్నాడు. ఉండవల్లికి చెందిన సైకిల్ షాప్ మెకానిక్ రమణకు.. ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్ గిరి గ్రామానికి చెందిన దంకాజ్మీ బ్యాంకు ఖాతా నుంచి పొరపాటున రూ.లక్ష జమయ్యింది. ఆ రాష్ట్రం నుంచి తనకు రావలసిన డబ్బులు ఏమీ లేకపోవడంతో పాటు, పంపించిన వ్యక్తి కూడా ఎవరో తెలియక పోవడంతో వెంటనే బ్యాంకుకు వెళ్లి.. డబ్బు పంపించిన వ్యక్తికి తిరిగి లక్ష రూపాయలు అకౌంట్ ద్వారా ట్రాన్స్ఫర్ చేశారు. మెకానిక్ నిజాయతీని మెచ్చుకున్న డబ్బు పంపిన వ్యక్తి.. రూ.3 వేలు బహుమతిగా అందజేశారు. తనది కాని డబ్బును వెంటనే సొంత లబ్ధిదారునికి చేర్చిన ఉండవల్లి మెకానిక్‌ను పలువురు అభినందించారు.

శబరిమల భక్తులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-గుంటూరు



శబరిమల వచ్చే అయ్యప్ప భక్తులకు వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అన్నారు. డిసెంబర్ ఒకటి నుంచి శబరిమల పంబ వద్ద నాలుగు రోజులు పాటు డాక్టర్ బూసిరెడ్డి నేతత్వంలోని వైద్యబందం భక్తులకు వైద్యసేవలు అందించారు. ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు వైద్యుల ఆహ్వానం మేరకు ఆరుగురు వైద్యుల బృందం ఉచితంగా సేవలు అందించారు. బుధవారం అక్కడి చికిత్స వివరాలను ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. శబరిమలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భక్తులు కొంతమేర ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. పంబ వద్ద రెండు రోజులు, కొండమీద ఆలయం వద్ద మరో రెండు రోజులు వైద్య సేవలు అందించామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యులు జనవరి 17వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందజేస్తారని డాక్టర్ నరేంద్ర రెడ్డి తెలిపారు.



క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్, తదితరులు

స్పోర్ట్స్‌మీట్‌లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

నర్సరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో నవంబర్ 27, 28, 29 తేదీలలో నిర్వహించిన స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ (నిప్స్ స్పోర్ట్స్ ఫియస్టా) లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్ పోటీలలో ద్వితీయ స్థానం పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 18 ఫార్మసీ కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్.అజిత్‌బాబును కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధు సూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, డాక్టర్ పి.సీతారామయ్య అభినందించారు.

త్రిసభ్య కమిటీ నివేదికను బహిర్గతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

వర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక - అధ్యక్ష,కార్యదర్శులుగా రూపస్, నవిత

ప్రజాశక్తి - ఎఎన్‌యు



నూతనంగా ఎన్నికైన నవిత, రూపస్

యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్లో ఫుడ్ బాగోలేదని విద్యార్థులు ధర్నా చేయగా ప్రభుత్వం త్రీ మ్యాన్ కమిటీని వేసి విచారించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ తెలియజేయని పరిస్థితి ఉన్నదని, నివేదికను బహిర్గతం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ ఎస్ఎఫ్ఐ మహాసభ నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కె రూపస్, కె నవిత, ఆర్ట్స్ కాలేజీ ప్రెసిడెంట్‌గా ఉపేంద్ర, యూనివర్సిటీ సోషల్ మీడియా ప్రెసిడెంట్‌గా అజయ్, యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్‌గా అవని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతు నూతన కమిటీ భవిష్యత్తులో యూనివర్సిటీ విద్యార్థులు వారి సమస్యలతో పాటు, వర్శిటీ వస్తున్న వివిధ అంశాల గురించి ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీలో ఉన్న అధ్యాపకపోస్టులను భర్తీ చేయాలని, రిషితేశ్వరి కేసును కొట్టేయడం విచారకరమని దానిని రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని హైకోర్టు అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీతో పిబి సిద్ధార్థా కాలేజీ ఎంఒయు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో పిబి సిద్ధార్థ కళాశాల బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు వీసి ఆచార్య కే గంగాధర రావు సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం వలన పి.బి. సిద్ధార్థా కళాశాల, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్సెస్ విభాగాలు సంయుక్తగా పరిశోధనలు చేయటంలో, సాంకేతిక సదస్సులు నిర్వహించటంలో, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటంలో, పాఠ్య ప్రణాళికలు రూపొందిచటంలో, పరిశోధనలో, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు, అధ్యాపకులకు బోధించటంలో, వనరులులను వినియోగించుకోటంలో , ఇరువురు కలసి వివిధ సంస్థలకు సేవలను అందించి తద్వారా ఆదాయం చేకూర్చటం వంటి అంశంలో రెండు కళాశాలలు కలసి పనిచేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో పీ.బి.సిద్ధార్థా కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్.మేకా రమేష్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య కే .రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, పీ.బి.సిద్ధార్థా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ టి.ఎస్.రవి కిరణ్, ఉప విభాగ అధిపతి కె. సుధీర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల ఐటీ రికవరీలో ఒకే విధానం పాటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

పెన్షనర్ల నుండి ఐటి రికవరీ చేయటంలో రాష్ట్రం మొత్తం ఒకే విధానం పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు అసోసియేషన్ నాయకులు వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. ముందుగా పెన్షనర్ల నుండి సివిపి రికవరీ నిలుపదల చేయటంలో త్వరితగతిన చర్యలు చేపట్టినందుకుగాను రాష్ట్ర సంఘం తరుపున డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.అదే విధంగా పేస్లిప్‌లో ఫారం 16లోని లోపాలను సవరించాలని, పే స్లిప్‌లో ఫ్యామిలీ పెన్షనర్ యొక్క పుట్టిన తేదీని నమోదు చేయటానికి రాష్ట్రం మొత్తం డిటిఒలకు, ఎస్‌టిఒలకు తగిన ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లూర్థురెడ్డి, జిల్లా ఉపాధక్షులు యం.ఎస్. నాగేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఐ.సాయిబాబా తదితరులున్నారు.



ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

స్పెషల్ టాస్క్ ఫోర్స్ కీలక భూమిక : రేంజ్ ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



టాస్క్‌ఫోర్స్ సిబ్బంది విశ్రాంతి హాలును ప్రారంభిస్తున్న ఐజి తదితరులు

స్థానిక నగరంపాలెం పోలీసు స్టేషన్ పక్కన నూతనంగా నిర్మించిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది విశ్రాంతి హాలును ఎస్‌పి సతీష్ కుమార్‌తో కలిసి గుంటూరు ఐ.జి. సర్వశ్రేష్ట త్రిపాఠి బుధవారం ప్రారంభించారు. నిత్యం శాంతిభద్రతల పరిరక్షణలో తలమొనకలై శ్రమిస్తున్న ఎస్‌టిఎఫ్ సిబ్బంది కష్టాన్ని గుర్తించి వారి విశ్రాంతి కొరకు నూతన బ్యారక్ నిర్మించామని ఎస్‌పి తెలిపారు. ప్రజా సమస్యల పరిరక్షణకై పాటు పడుతున్న పోలీస్ సిబ్బంది సంక్షేమం కొరకు ఆలోచించడం అనేది గొప్ప విషయమని ఈ నిర్మాణం కోసం కృషి చేసిన ఎస్‌పి ఆయన అభినందనలు తెలిపారు. సమయంతో సంబంధం లేకుండా జిల్లాలో ఏ మూలన ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా, ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తినా వెంటనే అక్కడకు వెళ్లి అక్కడ పరిస్థితులను చక్కదిద్దడంలో ఎస్‌టిఎఫ్ సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. సిబ్బందినీ కరచాలనంతో ఆప్యాయంగా పలకరించి, ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న విధులు, విధుల్లో ఎదురవుతున్న అవరోధాలు, వారికి అవసరమైన వసతులు మొదలగు వాటి గురించి ఆరా తీసి, ఎవరికి ఏవైనా సమస్యలు (వృత్తిపరమైన లేదా వ్యక్తిగతమైన) ఉంటే జిల్లా ఎస్‌పికి గానీ, తనకు కానీ తెలపాలన్నారు. ఇందుకు సహకరించిన అధికారులు హనుమంతు, ఉదయభాస్కర్, శివరామకృష్ణను ఆయన అభినందిచారు. విశ్రాంతి తీసుకోవడానికి అనువైన అధునాతన బెడ్డింగ్, వినోదం కోసం విజ్ఞానం కొరకు పుస్తకాలు, ప్రథమ చికిత్స కిట్లు, సామాను భద్రపరచు కోవడానికి వ్యక్తిగత లాకర్లు కలిగిన బీరువాలు, నూతన మరుగు దొడ్లు మొదలగు సౌకర్యాలను కల్పించారు. అదనపు ఎస్పీలు జీవి రమణ మూర్తి, హనుమంతు , డిఎస్పీలు సీతారామయ్య, రమేష్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్టు

13 ద్విచక్ర వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వివిధ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న యువకుడ్ని అరెస్టు చేసి రూ.8 లక్షల విలువైన 13 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్‌పిలు జయరాం ప్రసాద్, శివాజీరాజు తెలిపారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల భారీగా ద్విచక్ర వాహనాలు దొంగిలించబడుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా చిలకలూరిపేటకు చెందిన వల్లెపు సత్యదాసు (22) అనే యువకుడి నేరాలు చేస్తున్నట్టు గుర్తించి అరెస్టు చేశామన్నారు. 150 సిసి కెమెరాలు పరిశీలించి వేర్వేరు ప్రాంతాల్లో వాహనాలను దొంగతనం చేసినట్టు గుర్తించామన్నారు. చిన్నతనంలో చెడు వ్యసనాలకు బానిసై పాత గుంటూరు, నల్లపాడు, కొత్తపేట, అరండల్ పేట మరియు పల్నాడు జిల్లలో సత్తెనపల్లి రూరల్, నకరికల్లు, చిలకలూరి పేట, వినుకొండ మరియు బాపట్ల జిల్లాలోని అద్దంకి మొదలగు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి, తాకట్టు పెట్టిన వాటి ద్వారా వచ్చిన డబ్బుతో తన దురలవాట్లు తీర్చుకునే డిఎస్‌పి జయ ప్రసాద్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ వాహనాలను భద్రపరచుకోవడంలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు జిపిఎస్ సిస్టం మొదలగు వాటిని కూడా అమర్చుకోవాలని, ఏవైనా వాహనాలు దొంగతనానికి గురి అయితే వెంటనే పోలీసు వారికి సమాచారం అవ్వాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచిస్తున్నట్టు ఆయన తెలిపారు. నగరంపాలెం సిఐ వీర నాయక్ సిసిఎస్సిఐ సుబ్బారావు, ఎస్ఐలు రామాంజనేయులు, సలాం పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇల సర్వేకు సహకరించాలి : జిఎం విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో చేపట్టిన ఎంఎస్ఎంఇల సర్వేకు అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించి, అవసరమైన వివరాలు అందించి సహకరించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎ.విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ఎంఎస్ఎంఇల పనితీరును మెరుగు పరచటం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో కేంద్ర ప్రభుత్వం ఆర్ఎయంపి పథకాన్ని ప్రకటించినట్లు చెప్పారు. ర్యాంప్ పథకంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఇలను సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవా, వాణిజ్య రంగాల్లోని అన్ని ఎంఎస్ఎంఇలను సర్వే చేసి, వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్ లోకి తీసుకువచ్చి 'ఎపిఎంఎస్ఎంఇ వన్' అనే పోర్టల్‌కు అనుసంధానించటం, నమోదు కాని వ్యాపారాలను ఉద్యమ్, ఉద్యమ్ అసిస్ట్‌లో నమోదు చేయటం తద్వారా విధానపరమైన, మౌలిక వసతులకు సంబంధించిన కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టటం కోసం ఈ సర్వే ప్రారంభించినట్లు చెప్పారు. గుంటూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తెనాలి, మేడికొండూరు మండలంలో సర్వే చేసినట్లు తెలిపారు. నవంబర్ 29వ తేదీ నుండి జిల్లా మొత్తం అన్ని పట్టణాలు, గ్రామాల్లోనూ సర్వే ప్రారంభం అయ్యిందన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఇల డేటాబేస్‌ను అభివృద్ధి చేయటం జరుగుతుందని, సర్వేలో గుర్తించిన నమోదు కాని ఎంఎస్ఎలకు అవగాహన సదస్సులు నిర్వహించి ఉద్యమ్‌లో నమోదు చేస్తామన్నారు. దీని వల్ల వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందటానికి అర్హులు అర్హులవుతారన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం సులభతరం అవుతుంద న్నారు. ఎంఎస్ఎంఇల డిజిటల్ పేమెంట్లను సమాధన పోర్టల్తో అనుసంధానించటం ద్వారా వారి సమస్యలను సులభంగా పరిష్కరిం చవచ్చని, కావున సర్వేకు సహకరించాలని కోరారు.

పన్నులు చెల్లించని వారి ట్యాప్ కనెక్షన్ల తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని వారి నివాసాలు, వ్యాపార సంస్థలకు తొలుత ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం శ్రీనివాసరావు తోట, నల్లపాడు రోడ్డు, ఆదర్శనగర్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో ఆస్తి, నీటి పన్నులు చెల్లించని నివాసాలకు, కమర్షియల్ సంస్థలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్లను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పన్నుల కీలకమని, గరంలోని పన్నుదార్లు సకాలంలో పన్ను చెల్లించి జిఎంసికి సహకరించాలని కమిషనర్ కోరారు. పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండే వారికి జిఎంసి నుండి అందించే మున్సిపల్ ట్యాప్ కనెక్షన్, డ్రైనేజి కనెక్షన్ తొలగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగింపునకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీనివాసరావుతోట, నల్లపాడురోడ్, కెవిపి కాలనీ, నల్లచెరువులోని పలు నివాసాలు, కమర్షియల్ సంస్థలు ఆస్తి పన్నుబకాయిలు పెండింగ్‌లో ఉండడం, పలుమార్లు బకాయిల చెల్లింపు చేయాలని తెలిపినప్పటికీ చెల్లించని కారణంగా మున్సిపల్ ట్యాప్ కనెక్షన్లు తొలగించామని, తదుపరి కూడా స్పదించకుంటే విద్యుత్ కనెక్షన్, ఆర్.ఆర్. యాక్ట్ మేరకు జప్తు కూడా చేస్తామని తెలిపారు. అలాగే నల్లకుంట ఎదురు ఉన్న తాజ్ హోటల్ కి అనధికారికంగా ఉన్న మున్సిపల్ ట్యాప్‌ని కూడా తొలగించామన్నారు.

